క్లుప్తంగా

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు

• ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



గెడ్డవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

రాజాం సిటీ: ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు ఒకరికొకరు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర సూచించారు. మండలంలోని గెడ్డవలస, ఒమ్మి గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఇరువర్గాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ డి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజలు శాంతియుతంగా మెలగాలని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ప్రజలకు ఎన్నికల నిబంధనలపై బుధవారం అవగాహనా కల్పించారు. ప్రజలు గుంపులుగా తిరగవద్దని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.వి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

రాజాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బొద్దాం, పొగిరి, కంచరాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను ఎన్నికల సిబ్బంది బుధవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు జరుగుతుండడంతో ఆయా కేంద్రాల వద్ద ఓటరు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించారా లేదా అనే విషయం గమనించారు. తాగునీరు, విద్యుత్, టెంట్లు వంటి సదుపాయాలతో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ ఉండేలా చూడాలని తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రేగిడి: మండలంలోని వావిలవలస, లింగాలవలస, తోకలవలస గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్(కవాతు ప్రదర్శన) నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే ధైర్యాన్ని ఓటరుకు కల్పిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతు ప్రదర్శన చేస్తున్నామని ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు.

నేడు తెర్లాంలో ఎమ్మెల్యే ప్రచారం

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఓ ప్రకటనలో బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు డి.గదబవలస, 9 గంటలకు గోపాలవలస, 10 గంటలకు మాదంబట్లవలస, 11 గంటలకు కాగాం, 11.30 గంటలకు మోదుగువలస, 12 గంటలకు పాములవలస, 12.30 గంటలకు చుక్కవలస గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహిస్తారని, సాయంత్రం 4.30 గంటలకు నందబలగ, 5.30 గంటలకు కుసుమూరు, 6.30 గంటలకు నందిగాం, 7.30 గంటలకు లింగాపురం, 8.30 గంటలకు అంట్లవార, 9 గంటలకు గంగన్నపాడు, 9.30 గంటలకు రాజయ్యపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులంతా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ రాజాం చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామన్నారు. పాఠశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ స్థాపించడంతో పాటు యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నేత్రదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. చైతన్యకుమార్, ఎ.దామోదరరావు, పి.సూర్యారావు, పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే.. ప్రజలకు మరింత మేలు



రెడ్డియ్యవలసలో ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

• ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజానీకానికి మరింత మేలు అని, రానున్న ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని 14, 27వ వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. అన్నిప్రాంతాలతో పాటు అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ఆ దిశగా తన ఐదేళ్ల పాలన కొనసాగించి, అందరి మన్ననలు పొందారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు అమలుచేసి, ధైర్యంగా ప్రజలను ఓట్లు అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న అని అన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో 600కు పైగా హామీలు ఇచ్చి, వాటిలో 1 శాతం కూడా నెరవేర్చని చంద్రబాబు కూడా ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, ఎవరికి ఓటు వేయాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. నమ్మకంగా మనకు మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌దారుల వద్దకే పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క సర్టిఫికెట్ కావాలన్నా, రుణం కావాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా, పథకం అందాలన్నా అప్పటి జన్మభూమి కమిటీలు, నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ వచ్చేవి కావన్న విషయం గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఇప్పుడు కూర్చొన్న చోటకే పథకాలు వస్తున్నాయన్న విషయం మర్చిపోవద్దన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల వేళ మళ్లీ మోసపూరిత హామీలతో వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగనన్నకే మళ్లీ అధికారం అప్పగించాలన్నారు. ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోసారి గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌నాయుడు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.వేణుగోపాలనాయుడు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు టి.రామసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రెడ్డియ్యవలస, చింతాడ, గొంగాడవలస, శివడవలస, రాముడువలస గ్రామాల్లో బుధవారం సాయంత్రం పర్యటించిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి టి.దామోదరరావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పథకాలు కొనసాగింపు



యాతపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలికిన ప్రజలు

• ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగింపు సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణంలోని మల్లయ్యపేట, యాతపేట, ఇంజినీరింగ్ కాలనీ ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్నిరంగాల్లో అన్నివర్గాలకు సమన్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేశారని, ప్రతీవర్గంలోని ప్రజలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీపీ లక్ష్మణరావు తదితరులు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ అనుచరులతో కలిసి బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ గ్రామ నాయకులు బెవర ప్రసాద్, బెల్లాన ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబరు పొగ్గందొర పోలయ్య, మాజీ బ్యాంకు డైరెక్టర్ చెల్లూరి కృష్ణమూర్తి, లెంక రాము తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరం లబ్ధి పొందామని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఆయన రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, కొండకెంగువ గ్రామ నాయకులు బి.తిరుపతిరావు, ఎస్.శ్రీరామ్, కె.భాస్కరరావు, ఎం.రమణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డి.పైడిరాజు, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి



రామభద్రపురం: నరసాపురంలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా మహిళల ర్యాలీ



రామభద్రపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. బుధవారం చేపట్టిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులకు ప్రజల నుంచి ఆదరాభిమానాలు లభిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం: జగన్నాథపురంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాడంగి: కోడూరులో వైఎస్సార్ సీపీ నేతల ఎన్నికల ప్రచారం



బాడంగి: ముగడలో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్న పార్టీ నేతలు



తెర్లాంలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



తెర్లాం: పెరుమాళిలో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం: ఈవీఎంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ సతీమణి డాక్టర్ మాధవీలత



సంతకవిటి: బొద్దూరులో ఎన్నికల ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య



సంతకవిటి: మండాకురిటిలో ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న సర్పంచ్ జ్యోతీశ్వరరావు



వంగర: శ్రీహరిపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ప్రచారం



రేగిడి: పనసలవలసలో ఎన్నికల ప్రచారంలో ఈవీఎంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయడాన్ని నేర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం సిటీ: నందబలగలో వైఎస్సార్ సీపీ ఇంటింటా ఎన్నికల ప్రచారం



రాజాం సిటీ: బొద్దాంలో ఈవీఎంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడాన్ని నేర్పిస్తున్న వైఎస్సార్ సీపీ అభిమానులు

నిబంధనలు పాటించాలి

రాజాం సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆర్వో ఎల్.జోసెఫ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లతో బుధవారం సమావేశమైన ఆయన.. ఎన్నికల నిబంధనలు వివరించారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల దూరంలో ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తెలిపారు. అక్కడ కూడా ఒక టేబుల్, రెండు కుర్చీలే ఉపయోగించాలని, ఆ టీమ్ వద్ద పోస్టర్లు, సింబల్స్, తినుబండారాలకు అనుమతి లేదన్నారు. సదరు టీమ్ ఇచ్చే స్లిప్పులు కూడా తెల్లకాగితంపైనే ఉండాలన్నారు. పోలింగ్‌స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటున్న నేపథ్యంలో ఎక్కడా ప్రజలు గుమికూడి ఉండకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల వద్ద యజమానులు తప్ప రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు గానీ, ప్రచార సామగ్రి గానీ ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజున పరిసర ప్రాంతాల్లో గానీ, గ్రామంలో గానీ ఎటువంటి మైక్‌సెట్‌లు వాడకూడదన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను వాహనం ద్వారా తీసుకురాకూడదని, అలా తీసుకువచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా పనులు

రాజాం: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశమైన ఆయన.. ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా ఉపాధి పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారికే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే పనులు కల్పించాలని తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, చలువ పందిళ్లు, ప్రథమ చికిత్స కిట్‌లు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

• ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగింపు సాధ్యమని వైఎస్సార్ సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పిట్టాడ, మెంటాడ, కొంపంగి, చల్లపేట, ఇద్దనివలస, మీసాలపేట, పోరాం గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు అన్నివిధాలా బాగుండాలన్నదే జగనన్న తపన అని, ఆ దిశగా ఆయన ఐదేళ్ల పాలన కొనసాగిందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకురావడంతో పాటు గ్రామస్తుల మౌలిక సదుపాయాలను తీర్చేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మరోవైపు అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేశారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ఇంటింటికీ వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, రిటైర్డ్ ఇంటెలిజెన్స్ ఎస్పీ శశిభూషణరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర